క్లుప్తంగా

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సదుపాయాలు, సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో సునంద అన్నారు. శనివారం పుల్కల్‌లో అంగన్‌వాడీ స్కూల్ డే వారోత్సవాల సందర్భంగా పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆరేళ్లు నిండిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. పిల్లల పోషణ, ఎదుగుదల, ప్రాథమిక విద్య గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సుపర్‌వైజర్ కోమురవ్వ,అంగన్‌వాడీ టీచర్లుపాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అందాలి



బాన్సువాడ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని శనివారం బాన్సువాడలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి రిటైర్డ్ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులుగా ఏనుగు రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కౌసర్ మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు శంకర్, సిరాజుల్లా, ఫరీద్, మహమూద్, నారాయణ, రాములు, పండరి,గంగారం ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పర్యవేక్షణ అధికారి నగేష్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, కృష్ణాజీవాడి గ్రామాల్లో శనివారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో నర్సిములు, రైతులు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్లకు సన్మానం



భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి సింగిల్ విండోలో ఇంటర్ ఫస్టియర్ రాష్ట్రస్థాయి టాపర్లను శనివారం సన్మానించారు రాష్ట్రస్థాయిలో 468 మార్కులు సాధించిన అంతంపల్లి గ్రామానికి చెందిన చర్విత రెడ్డిని, 466 మార్కులు సాధించిన లక్ష్మి దేవునిపల్లి గ్రామానికి చెందిన వర్దన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో శ్రీనివాస్ చైర్మన్ వలకొండ వెంకటరెడ్డి ఉపాధ్యక్షుడు ఏనుగు రాజిరెడ్డి, డైరెక్టర్లు రాములు, పున్న గంగయ్య, ధర్మారెడ్డి ఉన్నారు.

నియామకం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్ శనివారం తెలిపారు. వార్డు అధ్యక్షుడిగా మామిడి కిషన్, ఉపాధ్యక్షుడిగా చాకలి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా తలారి సాయిలు, కార్యదర్శిగా భూమయ్య, కోశాధికారిగా చిరంజీవులును ఎన్నుకున్నట్లుఆయన తెలిపారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

ఎల్లారెడ్డి : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్, మల్లయ్యపల్లి, శివానగర్ తదితర గ్రామాల్లో బైక్ ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15లోగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని సజ్జన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను గెలిపించాలని కోరారు.

జహీరాబాద్‌లో విజయం కాంగ్రెస్‌దే..



కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి



పార్టీలో చేరిన నాయకులతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

దోమకొండ : జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ అత్యధిక మెజార్టీతో గెలిచేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు రుణమాఫీ జరుగుతుందన్నారు. తెలంగాణ పార్టీ ఆవిర్భావ ఉద్యమకారుడిగా ఉన్న మాజీ దోమకొండ సింగిల్‌విండో చైర్మన్ రావులపల్లి నర్సారెడ్డి, అంచనూరు ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మణ్, సింగిల్‌విండో డైరెక్టర్ కిష్టారెడ్డి, వార్డుసభ్యులు జనార్దన్, మాజీ శివరాంమందిర్ ఆలయకమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు హసన్‌తో పాటు పలువురు శనివారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తమాలలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని మత్తమాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మత్తమాల సొసైటీ వైస్ చైర్మెన్ పద్మారావు, మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ ఊషాగౌడ్, మండల అధ్యక్షులు సాయిబాబా నాయకులు ఉన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : మాచారెడ్డి, పాల్వంచ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సమక్షంలో 500 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీజేపీకి ఓటుతో గుణపాఠం చెప్పాలి



మాచారెడ్డిలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

మాచారెడ్డి : మేలు చేసే రిజర్వేషన్లను తొలగిస్తామంటున్న బీజేపీ పార్టీకి గుణపాఠం చెప్పాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం మాచారెడ్డి, పాల్వంచ మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని నిలిపేసిందన్నారు. లేకుంటే మచారెడ్డికు నీళ్ళు వచ్చేవన్నారు. ఉపాధి హామీ కూలీలకు రూ. 400 చెల్లిస్తామని షబ్బీర్ అలీ అన్నారు. బీబీపాటిల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ మాట్లాడుతూ గతంలో ఎంపీగా చాలా చేశానని, మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల అధ్యక్షులు నౌసిలాల్, రమేష్ గౌడ్, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రామచంద్రం తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



దోమకొండ : మండల కేంద్రానికి చెందిన మాజీ సీడీసీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఐరేని నర్సయ్య బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు శనివారం తెలిపారు. ఈ మేరకు రాజీనామా లేఖను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌కు పంపినట్లు వివరించారు. వ్యక్తిగత కారణాలు, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతానన్నారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని మర్యాద పూర్వకంగా కలిసినట్లు వివరించారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం..





మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ బాన్సువాడ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లిలో ప్రచారం

బాన్సువాడ రూరల్ : జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బలహీన వర్గాల బిడ్డ గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం బాన్సువాడ మండలం సోమేశ్వర్, కొల్లూర్, నాగారం గ్రామాల్లో ఆయన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్లుగా ఎంపీగా చేసిన బీబీపాటిల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, నాయకులు అంజిరెడ్డి, ఎర్వాల కృష్ణారెడ్డి, మోహన్‌నాయక్, పిట్ల శ్రీధర్, గంగుల గంగారాం తదితరులున్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, కృష్ణాజీవాడి, సంగోజీవాడి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్లమెంటు అభ్యర్థి గాలి అనికుమార్‌కు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వైస్ ఎంపీపీ నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

లింగారెడ్డిపేటలో ప్రచారం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లింగారెడ్డిపేటలో ఇంటింటికీ తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్ తదితరులున్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం





బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పాల్గొన్న భిక్కనూరు నాయకులు

కామారెడ్డి టౌన్ : బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్, కుంబాల రవి యాదవ్, ఎంజీ. వేణుగోపాల్ పాల్గొన్నారు.

భిక్కనూరు : బీఆర్‌ఎస్ శనివారం నిర్వహించిన 23వ ఆవిర్భావ దినోత్సవంలో భిక్కనూరు మండలానికి చెందిన ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు. ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, అందే మహేందర్ రెడ్డి, చిన్న నర్సారెడ్డి, పోతిరెడ్డి, నర్సారెడ్డి, బసవయ్య, రామచంద్రం ఉన్నారు.

బజరంగ్‌దళ్ నాయకుల ప్రచారం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామంలో బజరంగ్‌దళ్ నాయకులు శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బజరంగ్‌దల్ నాయకులు వినోద్, తులసి తదితరులున్నారు.

విద్యుత్‌లైన్‌పై కొమ్మలు తొలగించాలి



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని దేవునిపల్లి ఎస్‌బీఐ శాఖ వద్ద రావి చెట్టు కొమ్మలు తొలగించడం లేదని బ్యాంకు ఖాతాదారులు వాపోతున్నారు. గాలి దుమారం వచ్చిన సందర్భాల్లో అనేక సార్లు చెట్ల కొమ్మల రాపిడితో మంటలు వస్తున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్‌ను వివరణ కోరగా బ్యాంకు వద్ద వారం రోజుల్లో కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీలో చేరిన నాయకులు

లింగంపేట : మాజీ ఎమ్మెల్యే సురేందర్ ప్రధాన అనుచరులు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కమలం పార్టీలో బీబీ పాటిల్ సమక్షంలో చేరారు. మండలానికి చెందిన మాజీ ఎంపీపీ వడ్ల భీమయ్య, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నరహరి, మాజీ జడ్పీటీసీ కుమారుడు కమ్మరి వెంకటేశం, కారు దిగి కమలం పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నేరెళ్ల అంజనేయులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని సక్సెస్ చేయాలి



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి రెడ్డి గార్డెన్‌లో నేడు జరగబోయే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని సక్సెస్ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ కోరారు. సమావేశం సభను శనివారం పట్టణ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం చందు తదితరులున్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



బోర్లంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు



మహమ్మద్ నగర్‌లో..



మహమ్మద్‌నగర్‌లో వీక్షకుల మధ్య తోపులాట

జిల్లాలోని ఆయా మండలాల్లో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మహమ్మద్ నగర్‌లోజరిగిన కుస్తీ పోటీల్లో స్వల్ప తోపుటాల జరిగింది. నిజాంసాగర్‌లోని మల్లూర్ గ్రామంలో ఆదివారం మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బారెడు పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

– నిజాంసాగర్/బాన్సువాడ రూరల్

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

బాన్సువాడ రూరల్ : ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. శనివారం ఆయన మండల కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, క్షేత్రసహాయకులు, పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అత్యధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా కూలీలకు నీడ, నీరు, ప్రథమచికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఇంచార్జి ఏపీవో గంగాధర్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..



ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో ఇస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ పెద్దకొడప్‌గల్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వీరయ్య కాంగ్రెస్ సభకు వెళ్లడంతో ఆయనకు ఎంపీడీవో సూర్యకాంత్ మెమో జారీ చేశారు. 'పార్టీ కార్యక్రమానికి ఫీల్డ్ అసిస్టెంట్' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వీరయ్యకు మెమో జారీ చేశామని, రెండు రోజుల్లో లిఖితపూర్వకమైన సంజాయిషీ ఉవ్వాల్సి ఉంటుం

ఇండియా కూటమితోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో విజ్ఞాన భారతి కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక రంగాల పాత్ర అంశంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీని ఓడించాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ గౌడ్, రాజనర్సు, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు బాబాయ్, ఆశా యూనియన్ అధ్యక్షురాలు సుధా, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా సంకష్ట గణపతి వార్షికోత్సవం



దోమకొండ : మండల కేంద్రంలో శనివారం సంకష్ట గణపతి వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సిద్ధిబుద్ధి వినాయక కల్యాణం వైభవంగా జరిపారు. అంతకముందు సంకష్టగణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు భావి కృష్ణమూర్తిశర్మ, అర్చకులు శరత్‌చంద్రశర్మ, డైరెక్టర్లు తదితరులున్నారు.

చాముండేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి



దోమకొండ : దోమకొండలోని చాముండేశ్వరి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో వారం రోజులుగా జరుగుతున్న చాముండేశ్వరి ఆలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన, సంకష్ట గణపతి వార్షికోత్సవ ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఇలియాస్‌ను ఆలయ కమిటీ సన్మానించింది. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శులు అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, మాజీ చైర్మన్ నర్సారెడ్డి తదితరులున్నారు.

ఆలయంలో భక్తుల పూజలు

మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. భక్తులు సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహారాజ్‌కు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న సప్తాహం



మద్నూర్(జుక్కల్) : మండలంలోని మొగా గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ శివనామ సప్తహానికి భక్తులు తరలివస్తున్నారు. శనివారం భక్తులు, వార్కారీలు, భజన మండళ్లు పాల్గొని సప్తాహంలో పాటలు పాడుతూ భజనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు షబ్బీర్ అలీ రాక

రాజంపేట : పార్లమెంటరీ ఎన్నికల ప్రచార నేతథ్యంలో నేడు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్ లు రాజంపేట మండల కేంద్రానికి విచ్చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు.

కరెంటు బిల్లుల సేకరణకు వేళలు నిర్ణయించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో కరెంటు బిల్లుల సేకరణకు సమయాన్ని కేటాయించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు. గతంలో గ్రామంలోని చావిడీలు, జీపీలు, ప్రధాన వీధులలో స్థలాన్ని కేటాయించి కరెంటు బిల్లులు తీసుకునేవారు. కాని ప్రస్తుతం మండలంలో ఎక్కడ ఎప్పుడు కరెంటు బిల్లులు సేకరిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఒక్కోసారి నెల దాటిపోయి అపరాధ రుసుం కూడా కట్టాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా బిల్లులు తీసుకునేందుకు తేదీలు, స్థలం ముందుగానే తెలియజేయాలని వారు కోరుతున్నారు.

చెక్‌పోస్టు తనిఖీ..



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టును శనివారం అబ్జర్వర్ మోతీలాల్ షెటీ తనిఖీ చేశారు. నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న వాహనాల తనిఖీ వివరాలను ఆయన తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రతీ ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, డబ్బు, మద్యం రవాణాను అరికట్టాలని ఆయన సూచించారు. తహశీల్దార్ బిక్షపతి, గిర్దావర్ అంజయ్య, ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం

కామారెడ్డి రూరల్ : బీజేపీ కామారెడ్డి మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు చందన శ్రీధర్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా పల్లె శ్రీకాంత్‌గౌడ్, సోమిశెట్టి రాజలింగం, లింగుపల్లి భాస్కర్, చెన్నల అనిల్‌రెడ్డి, తోట సిద్దిరాములు, సందీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గొట్టిముక్కుల రవీందర్, మాసు శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల దృష్ట్యా ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు నర్సింగ్‌రావు, సిద్దిఖీ, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.